సాక్షి రంగారెడ్డి

మంగళవారం ౹ 6 ౹ మే ౹ 2025



విలీనం చేయాలి

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని మహేశ్వరం డిపో ఉద్యోగ జేఏసీ చైర్మన్ శంకర్ నాయక్ అన్నారు. 8లో ▸



'క్షయ'పై అప్రమత్తత..

క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టీబీ హెల్త్ విజిటర్ రాజు పేర్కొన్నారు. 8లో ▸



పాతబస్తీలో కొత్త పార్కింగ్

చార్మినార్ వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ కోసం కొత్త ప్రతిపాదనలతో జీహెచ్ఎంసీ మరోమారు సిద్ధమైంది. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేవెళ్లలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కాంచనలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థుల కోసం బీఏ (ఇంగ్లిష్, తెలుగు మీడియం), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్),బీఎస్సీ (లైఫ్ సైన్సెస్), బీఎస్సీ (ఫిజికల్ సైన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాల దోస్త్ కోడ్ 12041 అని చెప్పారు. వివరాలకు 94901 17490, 83281 76599 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు

కందుకూరు: మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్, కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విష్ణుప్రియ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌ల్లో ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రూప్‌లో 40 సీట్లు మాత్రమే ఉంటాయన్నారు. అర్హత గల విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థుల వివరాలను ఈ నెల 26న వెబ్‌సైట్‌లో ఉంచుతామని, 27 నుంచి 31వ తేదీ వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వస్తే పరిశీలించి ప్రవేశానికి అర్హత కల్పిస్తామన్నారు. జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. అర్హత గల విద్యార్థులు హెచ్‌టీటీపీ://183.82.97.97/ఎంఎస్‌టీజీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపించాలని జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ సునీల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ సునీల్ అర్జీలు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈవారం మొత్తం 51 ఫిర్యాదులు అందినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ మల్లురవి

కడ్తాల్: రైతు సంక్షేమం, ఆర్థికాభివృద్దే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని ముద్వీన్‌లో పీఏసీఎస్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతన్నలకందిస్తున్న చేయూతతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కడ్తాల్, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు బీచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ దేవేందర్, మండల వ్యవసాయ అధికారులు శ్రీలత, అరుణకుమారి పాల్గొన్నారు.



తియ్యని విషం!

మామిడి.. ఆరోగ్యంపై దాడి

- త్వరగా పక్వానికి వచ్చేలా వ్యాపారుల అడ్డదారులు
- యథేచ్ఛగా కార్బైడ్ వినియోగం
- తాజాగా కన్పించేందుకు వ్యాక్స్, సింథటిక్ కలర్లు
- రంగు చూసి కొంటే మోసపోయినట్లే..
- పట్టించుకోని అధికారులు



వినియోగిస్తున్న కార్బైడ్ ప్యాకెట్లు



కార్బైడ్‌తో కలిపి ప్యాకింగ్ (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తీపిని పంచాల్సిన పండ్లు కడుపుల్లో విషాన్ని నింపుతున్నాయి. మామిడిప్రియుల ఆరోగ్యంపై దాడి చేస్తున్నాయి. రైతులు తమ పంటను పక్వానికి ముందే తెంపి మార్కెట్లోకి తరలిస్తున్నారు. సహజసిద్ధంగా పండాల్సిన పండ్లను కృత్రిమ పద్ధతి (త్వరగా పండేలా నిర్ధేశిత ప్రమాణాలకు మించి క్యాల్షియం కార్బైడ్ వినియోగం)లో మగ్గబెడుతున్నారు. కంటికి అందంగా కన్పించేందుకు వ్యాపారులు వ్యాక్స్, సింథటిక్ కలర్లు అద్దుతున్నారు. వెరసి తరచూ వీటిని కొనుగోలు చేసి తిన్నవారికి ఆరోగ్య సమస్యలు (జీర్ణకోశ, శ్వాసకోశ, నాడీ సంబంధిత సమస్యలు, చర్మంపై దద్దుర్లు) తప్పడం లేదు. ఎప్పటికప్పుడు ఆయా మార్కెట్లలో తనిఖీలు నిర్వహించి, పండ్ల నాణ్యతను పరిశీలించాల్సిన మార్కెటింగ్, ఫుడ్ సేఫ్టీ అధికారులు కానీ, తూనికలు కొలతల అధికారులు కానీ అటు వైపు తొంగిచూసిన దాఖలాలు లేవు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మార్కెట్‌కు వచ్చిన కాయలను త్వరగా మగ్గించి, అంతే త్వరగా సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో సామర్థ్యానికి మించి రసాయనాలు వాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

తిన్న తర్వాత రుచీపచీ లేక..

విపరీతమైన మంచు కారణంగా పూత దశలోనే చాలా వరకు పంట దిగుబడి తగ్గింది. అంతో ఇంతో కాసిన కాయలు ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాలకు నేలరాలాయి. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. కాయలు పక్వానికి రాకముందే వివిధ రసాయనాలు చల్లి మగ్గిస్తున్నారు. మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి ధరలు అమాంతం పెంచేశారు. బహిరంగ మార్కెట్లో గత ఏడాది కిలో రూ.40 నుంచి రూ.60కే లభించిన పండ్లు ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100కుపైగా విక్రయిస్తున్నారు. వీధుల్లో తోపుడు బండ్లపై/మార్కెట్లో కంటికి అందంగా, సువాసన వెదజల్లుతూ కన్పించే ఈ పండ్లను తినేందుకు పిల్లలతో పాటు పెద్దలు సైతం ఇష్టపడుతుంటారు. ధర ఎక్కువగా ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తున్నారు. తీరా తిన్న తర్వాత రుచి లేకపోవడంతో ఉసూరుమంటున్నారు. కృత్రిమ పద్ధతిలో మగ్గించిన ఈ పండ్లను తరచూ తిన్నవారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఏది సహజమో..? ఏది కృత్రిమమో..?

సహజంగా పండిన పండు ఆకుపచ్చ, పసుపు పచ్చ రంగు మిశ్రమంతో కనిపిస్తుంది. ఇది సువాసన వెదజల్లుతుండటంతో పాటు పుల్లగా, తియ్యగా, రుచిగా ఉంటుంది. నీళ్లలో వేస్తే మునిగిపోతోంది. రసాయనాలతో పండిన పండుకు ఎలాంటి వాసన ఉండదు. రుచి, సుచి లేకుండా తింటే చప్పగా ఉంటుంది. పూర్తిగా పసుపు పచ్చ రంగులో కన్పించడంతో పాటు నీటిలో ఇట్టే తేలిపోతుంది. వ్యాపారులు సామర్థ్యానికి మించి రసాయనాలను వినియోగించినట్లు ధృవీకరిస్తే.. వారికి రూ.ఏడు లక్షల జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఫుడ్ సేఫ్టీ, తూనికలు కొలతల అధికారులు మార్కెట్లలో తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఆ రసాయనాలతో అనర్థాలు

మామిడి పండ్లు త్వరగా మగ్గించడానికి కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తుంటారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటి ప్రభుత్వ సంస్థలు సైతం దీన్ని నిర్దేశిత ప్రమాణాల మేరకు వాడుతుంటాయి. అవగాహన లోపానికి తోడు మార్కెట్లో నాణ్యమైన రసాయనాలు లేకపోవడంతో మెజార్టీ వ్యాపారులు తక్కువ ధరకు దొరికే కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. నిజానికి ఈ రసాయనాలను కాయకు తగలకుండా ప్రత్యేకంగా తయారు చేయించిన బాక్స్‌లో పెట్టి ఉంచాలి. చాలావరకు ఈ పౌడర్‌ను మామిడికాయల బాక్సుల్లో పొట్లాలు కట్టి ఉంచుతున్నారు. ఆ ప్యాకెట్‌ను నీటితో తడిపి పెడుతుండటంతో రసాయన ద్రావణం కాయపై పడుతోంది. గాలి చొరబడకుండా గడ్డి/పేపర్‌ను కప్పి ఉంచుతుండటంతో క్యాల్షియం కార్బైడ్ అసిటిలీన్ వాయువును విడుదల చేస్తుంది. ఇది అత్యధిక వేడిని కలిగిస్తుంది. వారం రోజుల్లో పండాల్సిన దాన్ని 12 నుంచి 24 గంటల్లోనే మగ్గిస్తుంది. అత్యంత చవకైనది కావడంతో వ్యాపారులు దీన్ని విరివిగా వినియోగిస్తున్నారు. కార్బైడ్‌లో ఆర్సెనిక్, పాస్ఫరస్ అవశేషాలు ఉండటంతో జీర్ణకోశ, నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. కొనుగోలుదారుల దృష్టిని ఆకర్షించేందు పండ్లు తాజాగా కలర్‌ఫుల్‌గా కన్పించేందుకు ఏకంగా వ్యాక్స్ కెమికల్స్‌తో పాటు, చైనా సింథటిక్ కలర్లు, కాయ ఎదుగుదలను ప్రోత్సహించే ఇథలిన్ వాయువును విడుదల చేసే ఎథేపాన్ వాడుతున్నారు. మోతాదుకు మించి వాడుతుండటంతో రుచి కూడా తగ్గిపోతోంది. పండ్లకు ఫంగస్ సోకకుండా ఉండేందుకు థియాబెండజోల్, కార్బెండజిమ్, సోడియం హైక్లోరైడ్ వంటి రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇవి శ్వాసకోశ, చర్మ సంబంధిత సమస్యలకు దారి తీస్తాయని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.



బయోచార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ

బయోచార్ ఉత్పత్తులతో నేలలు సారవంతం

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

కొత్తూరు: బయోచార్ ఉత్పత్తులతో వ్యవసాయ పొలాలు, నేలలు మరింత సారవంతంగా మారుతాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ అన్నారు. నందిగామ మండలంలోని కన్హా శాంతివనంలో హార్ట్ ఫుల్‌నెస్, పాపెల్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బయోచార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలా రాష్ట్రాల్లో మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తున్నారన్నారు. దీంతో పొలాలు, వాతావరణం కలుషితమవుతోందని తెలిపారు. దీనికి తోడు రైతులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. బయోచార్ ఉత్పత్తులతో పొలాలు మరింత సారవంతంగా మారడంతో పాటు పంటల దిగుబడి సైతం పెరుగుతుందన్నారు. గ్రామీణ స్థాయిలో చిరు వ్యాపారులు, రైతులే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా ఉన్నారన్నారు. వారికి బయోచార్ ఉత్పత్తులు మరింత ఆర్థికంగా బలోపేతం చేయడానికి తోడ్పడతాయన్నారు. గ్రామీణ స్థాయిలో బయోచార్ ప్లాంట్లను నెలకొల్పడానికి యువ పారిశ్రామికవేత్తలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. తక్కువ ఖర్చు, ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం, లాభసాటిగా ఉండే పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో ఏటా పంటల వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారని, దీంతో కాలుష్యంతో పాటు ఇతర ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిపారు. బయోచార్ ఉత్పత్తులతో పంటల వ్యర్థాలను పొలాలకు బలం చేకూర్చే ఎరువులను తయారు చేసే అవకాశం ఉందన్నారు. బయోచార్ ఉత్పత్తులను దేశ వ్యాప్తంగా రైతులు వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్లాంట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ వ్యవస్థాపకుడు కమ్లేష్ జీ పటేల్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగుపై అవగాహన పెంచుకోవాలి

యాచారం: ఆధునిక పద్ధతుల్లో పంటల సాగుకు రైతులు అవగాహన, చైతన్యం పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త ఏకాద్రి పేర్కొన్నారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడలో సోమవారం 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల సాగులో ఎరువుల యాజమాన్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తక్కువ యూరియా, అవసరం మేరకు రసాయనాల వినియోగంతో నేల తల్లిని కాపాడుకోవాలన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరిలో రకాలు, కొత్తరకం వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు మాట్లాడుతూ.. ఈ నెల 31 వరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు నమోదు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. రైతు నమోదు కార్యక్రమానికి పట్టాదారు, పాసుపుస్తకం, ఆధార్ కార్డుకు లింకు ఉన్న ఫోన్ నంబర్ వివరాలతో రైతు వేదికల వద్దకు వచ్చి వివరాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఏడీఏ సుజాత, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



మిస్ వరల్డ్ ఈవెంట్‌కు ముస్తాబవుతున్న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం

'మిస్ వరల్డ్'కు ముస్తాబు

- సర్వాంగ సుందరంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం
- అందాల పోటీలకు శరవేగంగా ఏర్పాట్లు
- ప్రధాన రహదారుల్లో ఆకర్షణీయంగా పచ్చదనం పెంపు

గచ్చిబౌలి: మిస్ వరల్డ్ పోటీలకు భాగ్యనగరం ఆతిథ్యమిస్తున్న వేళ చకాచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రారంభ వేడుకలకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం ముస్తాబవుతోంది. ఇండోర్ స్టేడియంతో పాటు ఐటీ కారిడార్‌లో ప్రధాన రహదారులకు తుది మెరుగులు దిద్దుతూ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అంతర్జాతీయ అతిథులను ఆకర్షించే రీతిలో రాష్ట్ర పర్యాటక శాఖ, జీహెచ్ఎంసీతో పాటు ఆయా విభాగాలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. బయో డైవర్సిటీ జంక్షన్ నుంచి హెచ్‌సీయూ డిపో వరకు ఇప్పటికే గ్రీనరీ పనులు చేపట్టారు. అర్బన్ ఫర్నిచర్, మీడియన్లు, రోడ్లకు రెండు వైపులా ఏర్పాటు చేసిన గ్రీనరీని మరింత ఆకర్శణీయంగా తీర్చిదిద్దుతున్నారు. రోడ్ల వెంబడి గోడలకు రంగు రంగుల పెయింటింగ్స్ వేస్తున్నారు. గచ్చిబౌలి, ట్రిపుల్‌ఐటీ, సైబర్ టవర్, హైటెక్స్ జంక్షన్లలో ఆహ్లాదంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మిస్ వరల్డ్ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, హైటెక్స్, శిల్పారామం, ట్రిడెంట్ హోటల్, శిల్పకళా వేదిక, టి–హబ్‌లలో ఈవెంట్లు నిర్వహించనున్నారు. వీటన్నింటినీ కలుపుతూ ప్రధాన రహదారులు, జంక్షన్లలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

- ❖ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో పోటీల ప్రారంభ వేడుకలతో పాటు జానపద కళాకారుల కార్యక్రమం ఉంటుంది. దీంతో స్టేడియంలోని రోడ్లకు ఇరువైపులా మొక్కలు, పచ్చిక బయలు నాటి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. డెలిగేట్స్‌కు భోజన ఏర్పాట్ల కోసం ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు.
- ❖ గాలి, వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా భారీ వాటర్‌ప్రూఫ్ గుడారాలను అమర్చారు.
- ❖ స్టేడియానికి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.
- ❖ గచ్చిబౌలి జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్‌తో పాటు సైబర్ టవర్ నుంచి హైటెక్స్, బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి సైబర్ టవర్, గచ్చిబౌలి నుంచి కొత్తగూడ, గచ్చిబౌలి నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు ప్రధాన రహదారుల వెంట చిందరవందరగా ఉన్న కేబుల్స్‌పై టీజీపీడీసీఎల్ అధికారులు దృష్టి సారించారు. ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా చేసే విధంగా మరమ్మతులు చేపట్టారు.

క్రీడాకారుల పెయింటింగ్స్

2002లో జరిగిన 32వ జాతీయ క్రీడల నిర్వహణతో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వచ్చింది. దాదాపు 23 ఏళ్ల నుంచి స్టేడియం రంగులకు కూడా నోచుకోలేదు. మిస్ వరల్డ్ ఈవెంట్‌తో ఇప్పుడు స్టేడియానికి రంగులు వేస్తున్నారు. గోడలపై రాష్ట్ర క్రీడాకారులు వీవీఎస్ లక్ష్మణ్, పుల్లెల గోపీచంద్, గగన్‌నారంగ్, మిథాలీరాజ్, సైనా నెహ్వాల్, సానియా మీర్జా, ముఖేష్ కుమార్‌తో పాటు పలువురు క్రీడాకారుల చిత్రాలు వేశారు.

30% మోత!

భారీగా చార్జీలు పెంచిన ఎల్ అండ్ టీ మెట్రో



- ప్రయాణికులపై రోజుకు రూ.కోటి భారం
- ఈ నెల 10 నుంచి కొత్త చార్జీలు అమలు
- కనిష్టంగా రూ.12, గరిష్టంగా రూ.75
- బెంగళూరులో చార్జీల పెంపు ప్రభావం పైన అధ్యయనం
- అక్కడ 45 శాతం పెంచడంతో ప్రయాణికులు 7 శాతం తగ్గుముఖం
- ఆ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని 30 శాతానికి పరిమితం

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో చార్జీల పెంపు ఖరారైంది. ఈనెల 10 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న చార్జీలను 30 శాతం వరకు పెంచనున్నారు. దీంతో ప్రయాణికులపై సుమారు రూ.కోటి భారం పడనుంది. ప్రస్తుతం సగటున ఒక ప్రయాణికుడు రోజుకు రూ.40 చొప్పున చార్జీలు చెల్లిస్తున్నట్లు భావిస్తే పెరుగనున్న చార్జీలతో మరో రూ.20 భారం పడనున్నట్లు అంచనా. అంటే కొత్త చార్జీలతో సగటు ప్రయాణికుడు సుమారు రూ.60 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రతి రోజు సుమారు 4.8 లక్షల మంది ప్రయాణికుల నుంచి టిక్కెట్‌ల రూపంలో ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైలుకు రూ.1.92 కోట్ల ఆదాయం లభిస్తుండగా, చార్జీల పెంపుతో రూ.2.88 కోట్ల వరకు లభించనున్నట్లు అంచనా. ఈ మేరకు ప్రతి నెలా సుమారు రూ.87 కోట్ల నుంచి రూ.90 కోట్ల వరకు ఆదాయం లభించొచ్చు.

కొంతమేర ఊరట

ప్రస్తుతం నగరంలో మెట్రో రైళ్లు సుమారు రూ.6,500 కోట్ల నష్టాలతో నడుస్తున్నాయి. మెట్రో రైళ్ల నిర్వహణ, విద్యుత్ వినియోగం, సిబ్బంది జీత భత్యాల చెల్లింపు, ఖర్చులను దృష్టిలో ఉంచుకొంటే టికెట్లపై వచ్చే ఆదాయం తక్కువే అయినా చార్జీల పెంపుతో కొంత మేరకు ఊరట లభించొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 2కిలోమీటర్ల కనిష్ఠ దూరానికి రూ.10 నుంచి 26 కిలోమీటర్లకు పైగా గరిష్ఠంగా రూ.60 వరకు చార్జీలు ఉన్నాయి. ఈ నెల 10 నుంచి కనిష్ఠ చార్జీలు రూ.12 నుంచి గరిష్ఠంగా రూ.75 వరకు ఉంటాయని అధికారులు తెలిపారు. నగరంలోని మూడు కారిడార్‌లలో ప్రతిరోజు సుమారు 1200 ట్రిప్పులు నడుస్తున్నాయి. జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఎంజీ బస్‌స్టేషన్ కారిడార్‌లో రద్దీ తక్కువగా ఉంటుంది. మిగతా రెండు కారిడార్లలోనే ప్రయాణికులు గరిష్ఠంగా రాకపోకలు సాగిస్తున్నారు. నాగోల్–రాయదుర్గం, ఎల్బీనగర్–మియాపూర్ కారిడార్లలో ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. 2017 నవంబర్‌లో మెట్రో రైళ్లను ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు చార్జీలు పెంచలేదు. ఏటా నష్టాలు నమోదవుతున్నప్పటికీ చార్జీల పెంపుపైన ప్రభుత్వం నుంచి సానుకూలత లభించకపోవడం, 2023 అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా చార్జీలను పెంచాలనే ప్రతిపాదన హైదరాబాద్ మెట్రోరైల్ ఎప్పటికప్పుడు వాయిదా వేసింది. 'రవాణా ఆధారిత ఆదాయం కూడా ఆశించిన స్థాయిలో లేదు. రైళ్ల నిర్వహణ భారంగా మారింది. దీంతో చార్జీలను పెంచకతప్పడం లేదు.' అని ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ప్రతినిధి ఒకరు చెప్పారు.

30 శాతం ఎందుకంటే..

చార్జీల పెంపుపై సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే 30 శాతం పెంచాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. కనిష్ఠ దూరానికి ఇది 25 శాతమే ఉంటుందన్నారు. ఈ మేరకు 4 నుంచి 6 కిలోమీటర్లకు ప్రస్తుతం రూ.15 ఉండగా ఇది రూ.20 వరకు పెరగనుంది. ప్రస్తుతం 22 కిలోమీటర్ల నుంచి 26 కిలోమీటర్ల వరకు రూ.55 చార్జీ ఉంది. ఇది రూ.70 వరకు పెరుగనుంది. 26 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరానికి రూ.60 ఉంటే రూ.75 వరకు చార్జీలు పెరగనున్నాయి. బెంగళూరు మెట్రో చార్జీలపైన ప్రత్యేకంగా అధ్యయనం చేసిన అనంతరం నగరంలో 30 శాతం కంటే ఎక్కువ పెంచరాదని భావించినట్లు అధికారులు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీ నుంచి ఆ నగరంలో మెట్రో చార్జీలను 45 శాతానికి పెంచారు. కొన్ని స్టేజీల మధ్య ఇది 50 శాతం వరకు ఉంది. దీంతో అక్కడ 4 కిలోమీటర్లకు రూ.20లు, గరిష్ఠంగా 26 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరానికి రూ.90 వరకు చార్జీలు పెరిగాయి. ఈ అనూహ్యమైన పెంపుపైన ప్రయాణికుల నుంచి విముఖత వ్యక్తమైంది. దీంతో సుమారు 7 శాతం వరకు ప్రయాణికులు తగ్గారు. ఆ నగరంలో ఎదురైన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌లో కొత్త చార్జీలను ఖరారు చేశారు.



ఎఫెక్ట్ ఎలా ఉంటుంది..

నగరంలో ప్రస్తుతం ప్రతి రోజు 4.8 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో 5 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన తరువాత మహిళా ప్రయాణికుల సంఖ్య తగ్గింది. చార్జీల పెంపు ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై సీరియస్‌గా దృష్టి సారించారు. కొత్త చార్జీలు అమల్లోకి వచ్చిన తరువాత ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకోనున్నట్లు అధికారులు చెప్పారు. బెంగళూరులో 45 శాతం పెంచడంతో కొంత వ్యతిరేకత వచ్చిందని, హైదరాబాద్‌లో అలాంటిది వ్యక్తం కాకపోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. నగరంలో మెట్రో రైళ్లను ప్రవేశపెట్టినప్పటి నుంచి చార్జీలు పెంచలేదనే అంశాన్ని ప్రధానంగా పేర్కొంటున్నారు.

ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి



సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ కార్మికులు

మహేశ్వరం ఆర్టీసీ డిపో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ శంకర్ నాయక్

మహేశ్వరం: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని మహేశ్వరం ఆర్టీసీ డిపో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం డిపో ఎదుట ఆయన కండక్టర్లు, డ్రైవర్లు, ఉద్యోగులతో కలిసి సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. ఈ నెల 7న మొదటి డ్యూటీ నుంచి ప్రారంభమయ్యే సమ్మెలో పాల్గొంటామన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు. ట్రేడ్ యూనియన్ ఆంక్షలను ఎత్తివేసి, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, వేతన సవరణ బకాయిలు చెల్లించి కొత్త అలవెన్సులను అమలు చేయాలని కోరారు.

ముంబైలోనూ లోకేంద్ర గ్యాంగ్ పంజా



అక్కడ ఓ బడా వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

- ఐదు కేజీల బంగారం ఎత్తుకుపోయిన ముఠా
- కాచిగూడలో నేరం చేయడానికి ఆరు నెలల ముందు
- ఈ కేసులో బిమ్లను అరెస్టు చేసిన నగర పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: కాచిగూడకు చెందిన కార్టన్స్ ఫ్యాక్టరీ యజమాని హేమ్‌రాజ్ దుగ్గర్ ఇంట్లో భారీ చోరీ చేసిన నేపాలీ గ్యాంగ్ సూత్రధారి లోకేంద్ర బహదూర్ షాహి నేతృత్వంలోని ముఠా చేసిన మరో నేరం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ పంజా విసరడానికి ఆరు నెలల ముందు ముంబైకి చెందిన ఓ బడా వ్యాపారి ఇంట్లో ఇదే పంథాలో 5 కేజీల బంగారం తస్కరించినట్లు వెలుగులోకి వచ్చింది. ఆ నేరంలో లోకేంద్ర పాత్ర ఖరారు చేశామని, మిగిలిన వారి పాత్ర తేలాల్సి ఉందని నగర అధికారులకు మహారాష్ట్ర పోలీసుల తెలిపారు. కాచిగూడ కేసు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి వివిధ రాష్ట్రాల పోలీసులతో పాటు భారత్–నేపాల్ సరిహద్దుల్లో ఉండే బలగాలతోనూ సంప్రదింపులు జరుపుతున్నారు.

వ్యవస్థీకృతంగా వ్యవహారాలు

కొన్నేళ్ల క్రితం నేపాల్ నుంచి వసలవచ్చిన లోకేంద్ర వ్యవస్థీకృతంగా ఈ చోరీలు చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇక్కడి వ్యాపారుల ఇళ్లల్లో పని చేస్తున్న నేపాలీల్లో కొందరితో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. వారి ద్వారా ఆయా వ్యాపారుల కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు తెలుసుకుంటున్నాడు. అప్పటికే పని చేస్తున్న వారి ద్వారానే, ఆ స్థానంలో మరో నేపాలీని పనిలో పెట్టిస్తున్నాడు. ఆపై అదును చూసుకుని తన ముఠాతో రంగంలోకి దిగి ఆ ఇంటిని కొల్లగొట్టిస్తున్నాడు. ముంబైకి చెందిన వ్యాపారి ఇంట్లో ఇదే పంథాలో ఐదు కేజీల బంగారం తస్కరించారు. ఈ నేరంలోనూ లోకేంద్రతో పాటు కాచిగూడ కేసులో వాంటెడ్‌గా ఉన్న దీపేందర్, చతుర్భుజ్ పాత్రల్నీ అక్కడి పోలీసులు అనుమానిస్తున్నారు. లోకేంద్ర అరెస్టు తర్వాతే దీనిపై క్లారిటీ కానుండటంతో అతడి కోసం గాలిస్తూ ఓ బృందాన్ని నేపాల్‌కు పంపారు. నగర పోలీసులకు చెందిన మూడు బృందాలు సైతం ఈ ముఠా కోసం వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నాయి.



లోకేంద్ర



దీపేంద్ర

దళారిగా మాట్లాడింది దేవేంద్రే అని గుర్తింపు

ఇక్కడ చోరీ చేసిన సొత్తుతో నేపాల్ వెళ్లిపోయే లోకేంద్ర అక్కడ ఉన్న ఓ వ్యాపారి ద్వారా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఆ మొత్తం నుంచి తన అనుచరులకు, నేరం చేయడానికి సహకరించిన వారిని వాటాలు ఇస్తున్నాడు. అనుచరులకు నేరుగా ఇస్తుండగా... సహకరించిన వారి కుటుంబీకులకు నేపాల్‌లోనే అందిస్తున్నాడు. ఆపై మరో నేరం చేయడానికి ఇంకో నగరాన్ని ఎంచుకుని లోకేంద్ర గ్యాంగ్ రంగంలోకి దిగుతోంది. ఇలానే హేమ్‌రాజ్ ఇంట్లో పని చేస్తున్న బిమ్లను సంప్రదించిన లోకేంద్ర ఆమె ద్వారా అర్పితను ఆ ఇంట్లో పనికి పెట్టాడు. మరో పనివాడు కావాలంటూ హేమ్‌రాజ్ ఆమెను కోరడంతో ఇంద్రస్ బహదూర్ అనే ఏజెంట్‌తో మాట్లాడించింది. అతడి ద్వారానే దీపేంద్ర హేమ్‌రాజ్ ఇంట్లో పనికి చేరాడు. ఆపై కేవలం వారం రోజుల్లోనే మిగిలిన వారితో కలిసి ఈ చోరీ చేశాడు. ఈ కేసు దర్యాప్తు నేపథ్యంలో కాచిగూడ పోలీసులు ఇంద్రస్ పేరుతో మాట్లాడింది కూడా దీపేంద్రే అని గుర్తించారు. లోకేంద్ర గ్యాంగ్‌కు సహకరించిన బిమ్లను పట్టుకున్నారు. ఆమెను అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు.

వాచ్‌మెన్ పేరుతో సిమ్‌కార్డు తీసుకుని..

హేమ్‌రాజ్ ఇంట్లో చోరీ చేయడానికి నగరానికి వచ్చిన లోకేంద్ర గ్యాంగ్ సైదాబాద్ ప్రాంతంలో షెల్టర్ తీసుకుంది. తన ఖాళీ స్థలంలో కొన్ని గదులు నిర్మించిన దాని యజమాని వాచ్‌మెన్ ఆధీనంలో ఉంచారు. ఆ వాచ్‌మెన్ ద్వారానే ఓ గదిని అద్దెకు తీసుకున్న ఈ గ్యాంగ్ షెల్టర్ ఏర్పాటు చేసుకుంది. ఈ నేపథ్యంలో వీరికి సంబంధించిన ఎలాంటి గుర్తింపు పత్రాలు వారి వద్దా అందుబాటులో లేవు. నేరం చేయడానికి ముందు వినియోగించడానికి ఓ సెకండ్ హ్యాండ్ ఫోన్‌ను నగరంలోనే ఖరీదు చేసిన లోకేంద్ర.. ఆ స్థలం వాచ్‌మెన్ పేరుతో సిమ్‌కార్డు తీసుకున్నాడని పోలీసులు గుర్తించారు. కాచిగూడలో నేరం తర్వాత హేమ్‌రాజ్ కారులో సంతోష్‌నగర్ వరకు వెళ్లిన ఈ ముఠా ఆ వాహనం అక్కడ వదిలేసింది. అక్కడ నుంచి ట్యాక్సీలో షోలాపూర్‌కు... అట్నుంచి మరో ట్యాక్సీలో పుణేకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ నుంచి ఎటు వెళ్లారనేది ఆరా తీస్తున్నారు. ఈ నేరంలో ఐదుగురి పాత్ర ఉన్నట్లు పోలీసులు తొలుత భావించారు. అయితే నేరుగా పాల్గొన్న నలుగురితో పాటు మరికొందరి పాత్ర ఉన్నట్లు ఆధారాలు సేకరించారు. వీరిలో బిమ్లతో సహా నలుగురిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించట్లేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆటో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. లేబర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్న జర్పుల మోతీలాల్(52) ఈ నెల 3న ఉదయం 8.30 గంటల ప్రాంతంలో తుర్కయంజాల్‌లో లేబర్ అడ్డాకు వెళ్లాడు. అదే రోజు సుభాష్‌నగర్ కాలనీ రోడ్డు నుంచి అక్షర స్టీల్ షాప్ ఎదుట రోడ్డు దాటుతుండగా ఓ ఆటో ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మృతి చెందాడు. రెండు రోజులుగా మోతీలాల్ ఇంటికి రాకపోవడంతో ఆయన కుమారుడు మోహన్ సోమవారం ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. కేసు దర్యాప్తులో ఉంది.

‘క్షయ’పై అప్రమత్తత అవసరం

కుల్కచర్ల: క్షయ వ్యాధిపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని టీబీ హెల్త్ విజిటర్ రాజు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తుల నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు, సహచరులకు టీబీ నిరోధక టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. క్షయ సోకిన వారు జాగ్రత్తలు పాటించకుంటే ఇతరులకు సోకే ప్రమాదం ఉంటుందన్నారు. ముందస్తు టీకాతో వ్యాధి నిరోధించే అవకాశం ఉంటుందని చెప్పారు. పౌష్టికాహారం తీసుకుంటూ.. వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



టీబీ నిరోధక టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

అడ్డా కూలీలే లక్ష్యంగా దోపిడీ

నలుగురు నిందితులకు రిమాండ్

చేవెళ్ల: అడ్డాపై పనికి వెళ్లే మహిళా కూలీలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న వారిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను చేవెళ్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉపేందర్ సోమవారం వెల్లడించారు. ఎవరికీ అనుమానం రాకుండా అడ్డాపైకి వెళ్లి పని ఉందని చెప్పి మహిళలను బైక్‌పై తీసుకెళ్తారు. నిర్మానుష్య ప్రదేశానికి చేరుకుని వారి వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలు లాక్కుని వెళ్తారు. ఇదే తరహాలో గత నెల చేవెళ్లలో నమోదైన కేసును దర్యాప్తు చేస్తున్న క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, రాజేంద్రనగర్, శంషాబాద్ సీసీఎస్ పోలీసులతో కలిసి గాలింపు చేపట్టారు. వరంగల్ జిల్లా చందూర్‌గూడెం గ్రామానికి చెందిన సంపంగి శ్రీనివాస్ అలియాస్ శ్రీను.. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ ఉంటున్నాడు. ప్రధాన నిందితుడైన ఇతనితో పాటు శివ, వీరమల్లు, వెంకటమల్లును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వీరు చేవెళ్ల, నందిగామ, షాద్‌నగర్, నల్గొండ, వికారాబాద్, హుజూర్‌నగర్‌లతో పాటు పలు ప్రాంతాల్లో దోపిడీలు, స్నాచింగ్‌లకు పాల్పడినట్లు తెలిపారు. శ్రీనివాస్ గతంలో పలుమార్లు జైలుకు వెళ్లాడన్నారు. వీరినుంచి 8.5 తులాల బంగారం, 18 తులాల వెండిని రికవరీ చేసినట్లు వెల్లడించారు.

వెటర్నరీ అసిస్టెంట్‌పై చర్యలకు డిమాండ్



నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న నాన్ గెజిటెడ్ వెటర్నరీ ఉద్యోగులు

నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పశు సంవర్ధకశాఖ లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణమాచారిని అసభ్య పదజాలంతో దూషించిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వెంకట్‌యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని నాన్ గెజిటెడ్ వెటర్నరీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు. తోటి ఉద్యోగిని దూషించిన ఆయనను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ ఆ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బింగి సురేష్, కార్యదర్శి అభిషేక్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు రతన్, కోశాధికారి సుధాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: ఈతకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కుంటలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూర్ చెందిన చిన్ననోళ్ల మహేశ్(32) తెల్లాపూర్ మున్సిపాలిటీలో ప్రైవేటుగా ఉద్యోగి. ఆయనకు భార్య నాగమణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం తన స్నేహితుడు శ్రీనివాస్‌తో కలిసి శంకర్‌పల్లి మండలం మిర్జాగూడ సమీపంలోని బతుకమ్మ కుంటలో ఈతకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు మహేశ్ కుంటలో పడి మృతి చెందాడు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.



మహేశ్(ఫైల్)

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. మహిళ దుర్మరణం

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

గుర్రంపోడు: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో మహిళ మృతిచెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని చేపూరు క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బాలాపూర్‌కు చెందిన అంజుమఖాతూన్(43) కుమార్తె సబీనాఖాతున్, అల్లుడు మహ్మద్ సలామ్ నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పోచంపల్లిలో ఓ రైతు తోటలో కూలీ పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నారు. కుమార్తెను, అల్లుడిని చూసేందుకు అంజుమాఖాతున్, ఆమె భర్త అబ్దుల్ సలామ్‌తో కలిసి పోచంపల్లికి వచ్చారు. సోమవారం పని నిమిత్తం అల్లుడు మహ్మద్ సలామ్ తన బైక్‌పై అత్త అంజుమఖాతూన్, మామ అబ్దుల్ సలామ్‌ను ఎక్కించుకుని చేపూరుకు వెళ్లి తిరిగి పోచంపల్లికి వస్తుండగా.. చేపూరు క్రాస్ రోడ్డు వద్ద నల్లగొండ నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజుమఖాతూన్ అక్కడికక్కడే మృతిచెందింది. మహ్మద్ సలామ్, అబ్దుల్ సలామ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంజుమఖాతూన్ మృతదేహాన్ని పోలీసులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె సబీనాఖాతూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు పాటించని న్యాయవాదులకు నోటీసులు

ఇబ్రహీంపట్నం: బార్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా కొత్త కార్యవర్గాన్ని ప్రకటించుకున్న న్యాయవాదులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు బార్ అసోసియేషన్ ఇబ్రహీంపట్నం అధ్యక్షుడు ముద్దం వెంకటేశం, ప్రధాన కార్యదర్శి అరిగే శ్రీనివాస్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ బార్ కౌన్సిల్ నియమాల ప్రకారం నిర్వహించిన ఎన్నికల్లో ఓటమిపాలైన కొంతమంది, ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ పేరుతో మరో కార్యావర్గాన్ని ప్రకటించారని పేర్కొన్నారు. ఇది బార్ అసోసియేషన్ నియమ, నిబంధనలకు వ్యతిరేకమని తెలిపారు. ఈ కార్యవర్గంతో పాటు ఇందుకు సహకరించిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరుతూ బార్ కౌన్సిల్‌కు సిఫారసు చేసి, షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

మీటర్ల ‘గోల్‌మాల్’ వ్యవహారంలో ఏఈ సహా మరో ఇద్దరిపై వేటు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్ మీటర్ల గోల్‌మాల్ వ్యవహారంలో బాధ్యులపై వేటు పడింది. ఏఈ సహా లైన్ ఇన్‌స్పెక్టర్, మీటర్ రీడర్లను సస్పెండ్ చేసింది. మంజూరైన మీటర్లను సంబంధిత వినియోగదారుల నివాసాలకు అమర్చకుండా గుట్టుగా నిల్వ చేసిన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో చేర్చింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సైబర్‌సిటీ సర్కిల్ ఇబ్రహీంబాగ్ డివిజన్ చిత్రపురి కాలనీలోని ఓ కాంట్రాక్టర్ ఇంట్లో 42 విద్యుత్ మీటర్లు లభ్యమైన విషయం తెలిసిందే. దుండిగల్, ఇబ్రహీంబాగ్, సరూర్‌నగర్‌లో విద్యుత్ మీటర్లు పక్కదారి పట్టిన విషయంపై మూడు రోజుల క్రితం సాక్షిలో ‘మీటర్ల గోల్‌మాల్’ శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ అంశంపై సీఎండీ ముషారఫ్ ఫా రూఖీ సీరియస్ కావడంతో పాటు సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రంగారెడ్డిజోన్ సీజీఎం పాండ్యానాయక్ అంతర్గత విచారణ చేపట్టి సీఎండీకి సమగ్ర నివేదిక అందజేశారు. ‘తెలుగు సినీ వర్కర్స్ కో ఆపరేటీవ్ సొసైటీ’ పేరున జనవరి 25న 42 విద్యుత్ మీటర్లు జారీ చేసినట్లు గుర్తించారు. డిస్కం మంజూరు చేసిన ఈ మీటర్లను వినియోగదారుల ఇంటికి అమర్చకుండా కాంట్రాక్టర్ చెన్నకేశవరెడ్డి తన ఇంట్లోనే నిల్వ చేయడంతో పాటు ఏప్రిల్ నెలలో వీటికి బిల్లులు కూడా జారీ చేశారు. ఈ అంశంపై స్థానిక ఏఈ భాస్కర్‌రావు సహా లైన్ ఇన్‌స్పెక్టర్, మీటర్ రీడర్ల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అయింది. మీటర్ల గోల్‌మాల్‌కు కారణమవడంతో పాటు సంస్థ ఆర్థిక నష్టాలకు కారణమైన ఏఈ సహా మీటర్ రీడర్, లైన్ ఇన్‌స్పెక్టర్లను డిస్కం యాజమాన్యం సోమవారం సస్పెండ్ చేసింది. అంతేకాకుండా సదరు కాంట్రాక్టర్‌పై ఇప్పటికే రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయించింది. బ్లాక్ లిస్ట్‌లో చేర్చడంతో పాటు లైసెన్సును రద్దు చేయాల్సిందిగా కోరుతూ సీఈఐ జీకి లేఖ రాసింది.



పాతబస్తీలో కొత్త పార్కింగ్



- మల్టీ లెవెల్ కాంప్లెక్స్‌కు టెండర్లు
- పీపీపీ విధానంలో నిర్మాణం, నిర్వహణ ప్రైవేటుకు
- జీహెచ్ఎంసీకి ఆదాయంలో వాటా

సాక్షి, సిటీబ్యూరో: ఏళ్ల తరబడి కార్యరూపం దాల్చని చార్మినార్ వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ కోసం కొత్త ప్రతిపాదనలతో జీహెచ్ఎంసీ మరోమారు సిద్ధమైంది. ఇందుకుగాను అర్హత కలిగిన ఏజెన్సీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించింది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ)విధానంలో అందుబాటులోకి తెచ్చే ఈ కాంప్లెక్స్ కోసం జీహెచ్ఎంసీ స్థలం అప్పగించడం మినహా ఎలాంటి వ్యయం చేయదు. వచ్చే ఆదాయంలో తగిన వాటా మాత్రం జీహెచ్ఎంసీకి ఇవ్వాల్సి ఉంటుంది. కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్ డిజైన్ల నుంచి మొదలు పెడితే నిర్మాణం, నిర్వహణ అన్నీ ఎంపికయ్యే ప్రైవేటు ఏజెన్సీవే. ఈ కాంప్లెక్స్‌లో పార్కింగ్ సదుపాయంతోపాటు కొన్ని వ్యాపారాలు నిర్వహించుకునేందుకు కూడా అద్దెలకిస్తారు. పార్కింగ్, అద్దెల ద్వారా ఏజెన్సీకి లభించే ఆదాయంలో జీహెచ్ఎంసీకి నిర్ణీత శాతం చెల్లించాల్సి ఉంటుంది. నిర్మాణంలో సేఫ్టీ రెగ్యులేషన్స్, పర్యావరణ ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. ర్యాంపులు, మెట్లమార్గాలు, లిఫ్టులు, లైటింగ్, సైనేజీలతో పాటు కిచెన్, వాష్‌రూమ్ సదుపాయాలు, ల్యాండ్‌స్కేపింగ్, తదితరమైనవి ఉండాలి.

అధిక ఆదాయం పొందాలి

ఆటోమేటిక్ సదుపాయాల్లో భాగంగా డిజిటల్ డిస్‌ప్లేలు, పార్కింగ్ సదుపాయం ఉన్నదీ లేనిదీ ఆన్‌లైన్‌లో తెలిసేలా రియల్‌టైమ్ అప్‌డేట్స్ ఉండాలి. ఫీజుల వసూళ్లకు డిజిటల్ చెల్లింపులతోపాటు నగదు కియోస్క్‌లు కూడా ఉండాలి. అద్దెల కిచ్చే దుకాణాల్లో విద్యుత్, నీరు, చెత్తనిర్వహణ ఏర్పాట్లుండాలి. నిర్వహణ లోపాలుండరాదు. పరిశుభ్రంగా ఉండాలి. రూఫ్‌టాప్ గార్డెన్ నిర్వహించాలి. ఫైర్ సేఫ్టీ, సీసీటీవీ సర్వైలెన్స్, ఎమర్జెన్సీ ఎగ్జిట్స్ వంటివి సరేసరి. వీటితోపాటు సెక్యూరిటీ సిబ్బంది ఉండాలి. కస్టమర్ సర్వీస్ బాగుండాలి. పార్కింగ్ ఫీజుల తోపాటు దుకాణాల అద్దెలు, వ్యాపార ప్రకటనల ద్వారా ఏజెన్సీ ఆదాయం పొందవచ్చు. పెట్టే పెట్టుబడి, దానికయ్యే వడ్డీ, తదితరమైనవి పరిగణనలోకి తీసుకొని జీహెచ్ఎంసీ ఆదాయంలో తన వాటాను నిర్ణయిస్తుంది. ఆదాయంలో మెజార్టీ భాగం ఏజెన్సీకే అయినా, తగిన వాటా జీహెచ్ఎంసీకి చెల్లించాలి. ఒప్పందం పరిమితి 10 లేదా 15 సంవత్సరాలుగా నిర్ణయించనున్నారు. ఆ గడువు ముగిశాక మల్టీ లెవెల్‌పార్కింగ్‌కాంప్లెక్స్‌ను జీహెచ్ఎంసీకి అప్పగించాల్సి ఉంటుంది. చార్మినార్ పాత బస్టాండ్ దగ్గర దీన్ని ఏర్పాటు చేయనున్నారు.

పౌల్ట్రీ ఫాంలో కార్మికుడి మృతి

మొయినాబాద్: మద్యం మత్తులో కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి చిలుకూరులో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా కోస్తు వలసకు చెందిన వేణుగోపాల్‌రావు(46) తన తమ్ముడు లక్ష్మణ్‌తో కలిసి రెండు నెలల క్రితం చిలుకూరుకు వలస వచ్చారు. స్థానికంగా ఓ పౌల్ట్రీ ఫాంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు లక్ష్మణ్ పనికి వెళ్లగా వేణుగోపాల్ బయటకు వెళ్లాడు. సాయంత్రం మద్యం మత్తులో వచ్చిన వేణు తమకు కేటాయించిన గది ఎదుట పడుకున్నాడు. తోటి కార్మికుడు సబిలాల్ సోమవారం ఉదయం నిద్రలేపేందుకు ప్రయత్నించగా ముఖంపై రక్తపు మరకలు కనిపించాయి. అతని నోరు, ముక్కునుంచి రక్తస్రావమైంది. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అర్ధరాత్రి సరిహద్దు కంచె దాటి..

వ్యభిచారం కోసం బంగ్లాదేశ్ నుంచి నగరానికి వచ్చిన యువతి

బంజారాహిల్స్: ట్రావెల్ ఏజెంట్ సహకారంతో బంగ్లాదేశ్‌కు చెందిన ఓ యువతి వ్యభిచారం చేసేందుకు అర్ధరాత్రి ఆ దేశ సరిహద్దు దాటి భారత్‌లోకి ప్రవేశించింది. మొదట పశ్చిమబెంగాల్ చేరుకున్న ఆమె అక్కడి నుంచి బెంగళూరుకు వెళ్లి, చివరకు హైదరాబాద్‌కు చేరుకుంది. జూబ్లీహిల్స్ పోలీసులు వ్యభిచార గృహంపై చేసిన దాడిలో పోలీసులకు చిక్కింది. వివరాల్లోకి వెళితే..బంగ్లాదేశ్, మాణిక్‌గోంజ్ జిల్లాకు చెందిన యువతి (23) 2024లో రకీబ్ అనే ట్రావెల్ ఏజెంట్ సహాయంతో అర్ధరాత్రి దేశ సరిహద్దు దాటి పశ్చిమబెంగాల్‌లోకి ప్రవేశించింది. కొంతకాలం పాటు అతను ఆమెకు ఆ రాష్ట్రంలోనే ఆశ్రయం కల్పించాడు. ఆమెకు సిమ్‌కార్డు సైతం సమకూర్చి బెంగళూరుకు తీసుకెళ్లి అక్కడ మూజమ్ అనే వ్యక్తికి అప్పగించాడు. నెల రోజుల పాటు గదిలో ఉంచిన మూజమ్ ఆమెతో వ్యభిచారం చేయించాడు. ఆ తర్వాత ఆమె బెంగళూరులోని కోరమంగళకు పారిపోయి, బంగ్లాదేశ్‌కు చెందిన మిస్తి అనే స్నేహితుడిని కలుసుకుంది. అతని వద్ద రెండు నెలల పాటు తలదాచుకుంది. మిస్తి ఆమెను అఖిల్ అనే వ్యక్తికి అప్పగించగా, వ్యభిచారం చేస్తే ఎక్కువ జీతం ఇస్తానని అఖిల్ హామీ ఇచ్చాడు. ఈ క్రమంలో అఖిల్ సూచన మేరకు గత నెల 21న బస్సులో హైదరాబాద్ చేరుకున్న ఆమె అతని ఇంట్లో 10 రోజులు ఉంది. ఆ తర్వాత సదరు యువతి మరిన్ని డబ్బులు సంపాదించేందుకు నాయక్ అనే వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించింది. నాయక్ ఆమెను గత నెల 30న జూబ్లీహిల్స్‌లోని మింట్ లీవ్స్ సర్వీస్డ్ అపార్ట్‌మెంట్ రూం నెంబర్–112లో దించేందుకు క్యాబ్ ఏర్పాటు చేశాడు. కస్టమర్లను సంప్రదించి గదికి పంపుతానని నాయక్ ఆమెకు చెప్పాడు. అయితే వ్యభిచార దందాపై పోలీసులకు సమాచారం అందడంతో సదరు అపార్ట్‌మెంట్‌లోని గదిపై సోమవారం దాడులు నిర్వహించిన పోలీసులు బంగ్లాదేశ్ యువతితో పాటు కస్టమర్లను అరెస్టు చేశారు. యువతిని పునరావాస కేంద్రానికి తరలించిన జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.